క్లుప్తంగా

చేయూతనివ్వడంలోనే సంతృప్తి..



పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్న చంద్రశేఖర్

విజయనగరం ఫోర్ట్: పేదలకు చేయూతనివ్వడంలోనే సంతృప్తి ఉందని మారుతీ స్వయం సహాయక సంఘ అధ్యక్షుడు గుత్తురు చంద్రశేఖర్ అన్నారు. స్థానిక కణపాక అగురవీధిలో శుక్రవారం వంద మంది పేదలకు బియ్యం, గోధుమనూక పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తల్లిదండ్రులను ప్రేమగా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తులసీరామ్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలే ప్రాణదాతలు



రక్తదానం చేస్తున్న యువకులు

విజయనగరం ఫోర్ట్: రక్తదాతలే ప్రాణదాతలని గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్ అన్నారు. స్థానిక విజయ బ్లడ్ బ్యాంక్‌లో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ ఏడాదికి నాలుగు సార్లు రక్తదానం చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో విలియం జోన్స్, సీహెచ్ దివాకర్, తదితరులు పాల్గొన్నారు.

మోదీని గద్దె దించండి..



ప్రచారభేరీ సభలో మాట్లాడుతున్న వామపక్షాల నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: ప్రధాని మోదీని గద్దె దించి, దేశాన్ని కాపాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ పిలుపునిచ్చారు. సీపీఐ, సీపీఎం ప్రచారభేరీ సభ శుక్రవారం స్థానిక కలెక్టరేట్ వద్ద జరిగింది. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రెడ్డి శంకరరావు, సీపీఐ నాయకులు బి. అశోక్, రంగరాజు, పావని, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పెద బూరాడపేటలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ అని కొనియాడారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చనమల్లు వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, సర్పంచ్ మక్కువ తవుడమ్మ, ఎంపీటీసీ సభ్యుడు సంగంరెడ్డి జగన్నాథం, నేతలు గిరిబాబు, కేపీ నాయుడు, కర్రోతు వెంకటరమణ, వాల్లే అప్పలనాయుడు, బెల్లాన రామారావు, మక్కువ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ధైర్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు



విజయనగరం రూరల్: మండలంలోని దుప్పాడ గంగానగర్‌లో శ్రీక్షేత్రమ్‌లో కొలువై ఉన్న అష్టలక్ష్మీ సమేత ఐశ్వర్య వెంకటేశ్వరుని ఆలయంలోని ధైర్యలక్ష్మి అమ్మవారికి శుక్రవారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి రమేష్ ఆచార్యులు, శ్రీనివాస రమేష్ ఆచార్యులు అమ్మవారికి అర్చన, ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో దేవాలయ ధర్మకర్తలు దుర్గాబాలాజీ, ఉమాదేవి, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

వీధిలైట్ల ఏర్పాటు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని 7వ వార్డులో స్థానిక కౌన్సిలర్ మైపాడ ప్రసాద్ తన సొంత నిధులతో వీధిలైట్లు ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలోని పలు స్తంభాలకున్న లైట్లు పాడవ్వడంతో కొత్తగా 20 లైట్లు కొనుగోలు చేసి, ఎలక్ట్రీషియన్‌కు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు కౌన్సిలర్ ప్రసాదు‌ను అభినందించారు.

అంబేడ్కర్ అందరివాడు..

అంటరానితనాన్ని రూపు మాపేందుకు... బడుగు,బలహీనవర్గాల అభ్యున్నతికి కృషి చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందరివాడని వక్తలు అన్నారు. అంబేడ్కర్ జయంతి శుక్రవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారత రాజ్యాంగ నిర్మాతను యువత ఆదర్శంగా తీసుకోవాలని వక్తలు సూచిస్తూ, ఆయన జీవిత విశేషాలను వివరించారు.

– విజయనగరం/నెల్లిమర్ల నెట్‌వర్క్



విజయనగరం: కార్పొరేషన్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, అధికారులు, సిబ్బంది



విజయనగరం టౌన్: సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి



డెంకాడ: మోపాడలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు



డెంకాడ: రామతీర్థం జంక్షన్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోగిశ రామకృష్ణ



విజయనగరం పూల్‌బాగ్: అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఈఓ లింగేశ్వరరెడ్డి



విజయనగరం అర్బన్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయాల కార్యదర్శి ఎన్.లలిత



భోగాపురం:లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



పూసపాటిరేగ: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు జనార్దనరావు, తదితరులు



నెల్లిమర్ల: అంబేడ్కర్ జయంతి సందర్భంగా రక్తదానం చేస్తున్న జరజాపుపేటకు చెందిన శంకరరావు, రాము



విజయనగరం అర్బన్: అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జేఎన్‌టీయూ జీవీ వీసీ ప్రొఫెసర్ కేవీ సుబ్బయ్య



విజయనగరం ఫోర్ట్: కలెక్టరేట్ జంక్షన్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంఈఎఫ్ అధ్యక్షుడు ఇజ్రాయిల్



నెల్లిమర్ల రూరల్: అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న వీసీ జీఎస్ఎన్ రాజు, తదితరులు



విజయనగరం రూరల్: పినవేమలిలో రాజ్యాంగ నిర్మాత విగ్రహానికి పూలమాలలు వేస్తున్న సర్పంచ్ పీఎస్‌వీ సంతోష్



విజయనగరం టౌన్: జోనల్ వర్క్‌షాపులో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఈడీ రవికుమార్, తదితరులు

జగనన్న పాలనలో అర్హులందరికీ న్యాయం

• ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



నెల్లిమర్ల రూరల్: పెద బూరాడపేటలో సంక్షేమ పథకాల అమలుపై మహిళ అభిప్రాయాన్ని తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని పెద బూరాడపేటలో జగనన్నే మా భవిష్యత్.. కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నేతలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో చంద్రబాబు జన్మభూమి కమిటీలతో పాలన కొనసాగించి అర్హులకు సున్నం రాశాడని విమర్శించారు. నేడు అర్హతే ప్రామాణికంగా సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే రాబోయే ఎన్నికల్లో తమకు అండగా నిలబడాలని సూచించారు. అనంతరం ఇంటి యజమాని అనుమతితో సీఎం జగన్ ఫోటోతో కూడిన స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ గదల సన్యాసినాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చనమల్లు వెంకటరమణ, సర్పంచ్ మక్కువ తవుడమ్మ, ఎంపీటీసీ సభ్యుడు సంగంరెడ్డి జగన్నాథం, నేతలు దంతులూరి గిరిబాబు, కర్రోతు వెంకటరమణ, మక్కువ వెంకటరమణ, లెంక గోవింద, బెల్లాన రామారావు, వాల్లే అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రాకోడులో..

విజయనగరం రూరల్: మండలంలోని రాకోడు గ్రామంలో సర్పంచ్ పాటిపిరెడ్డి వెంకటరమణ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ – మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకటరమణ, పార్టీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అతికించారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన సాగిస్తున్న జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి బలపరచాలని సర్పంచ్ ప్రజలను కోరారు.

రూ. 22.50 లక్షలతో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

విజయనగరం: నగరంలోని 6వ డివిజన్ ప్రశాంతినగర్‌లో రూ.22.50 లక్షలతో నిర్మించనున్న రహదారి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్ బొద్దాన అప్పారావు, డివిజన్ కార్పొరేటర్ ఆల్తి సత్యకుమారి మాట్లాడుతూ, రహదారి లేక ఎన్నో ఏళ్లుగా తమ ప్రాంత ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడ్డారన్నారు. ఎట్టకేలకు విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి రహదారి నిర్మాణానికి రూ. 22.50 లక్షలు మంజూరు చేసి, పనులు ప్రారంభించడం ఆనందంగా ఉందని చెప్పారు. నగరాభివృద్ధిలో ఆయన చేస్తున్న కృషి మరువరానిదన్నారు. అంతకుముందు స్థానిక ప్రజలు ఎమ్మెల్యే కోలగట్లకు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతీదేవి, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండల డైరెక్టర్ బంగారునాయుడు, జోనల్ ఇన్‌చార్జ్ బోడసింగి ఈశ్వరరావు, పార్టీ నాయకులు ఆల్తి శ్రీనివాసరావు, చిట్టిరాజు, తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రతి నెలా 14న ‘ఆయుష్మాన్ భారత్’పై అవగాహన

డెంకాడ: సచివాలయ పరిధిలో ఉన్న హెల్త్ వెల్‌నెస్ సెంటర్లలో ఇకపై ప్రతి నెలా 14న ఆయుష్మాన్ భారత్ (హెల్త్ మేళా)పై అవగాహన సదస్సులు నిర్వహిస్తామని జిల్లా ఉప వైద్యాధికారి సూర్యనారాయణ అన్నారు. డెంకాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయుష్మాన్ భారత్‌పై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండేందుకు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ భవానీ, ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, సర్పంచ్ లెంక లక్ష్మణరావు, ఎంపీటీసీ సభ్యుడు విజినిగిరి అచ్చంనాయుడు, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సేవలపై అవగాహన..

పూసపాటిరేగ: ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేష్‌వర్మ హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల ద్వారా అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి ప్రమీలాదేవి, లక్ష్మీశైలజ, సిబ్బంది వేదమణి, ఆర్‌పీ రమణ, బంగారుబాబు, గణపతి, తదితరులు పాల్గొన్నారు.



డెంకాడ: ఆయుష్మాన్ భారత్‌పై అవగాహన ర్యాలీ

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం




బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ బంగారమ్మ

నెల్లిమర్ల రూరల్:

మండలంలోని కొండవెలగాడ గ్రామంలో ఇటీవల విద్యుత్ స్తంభం పైనుంచి ప్రమాదవశాత్తూ జారిపడి తీవ్రంగా గాయపడిన వంకర అప్పారావు కుటుంబానికి ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ శుక్రవారం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆక్రమిత స్థలం పరిశీలన



ప్రభుత్వ జూనియర్ కళాశాల స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ భాస్కరరావు, తదితరులు

పూసపాటిరేగ:

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కబ్జాదారులు ఆక్రమించుకున్న స్థలాన్ని తహసీల్దార్ ఇ. భాస్కరరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆక్రమణదారులు వేసిన స్తంభాలను దగ్గరుండి తీయించారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ఆయనతో పాటు మండల సర్వేయర్ గణపతిరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సత్తిబాబు, తదితరులు ఉన్నారు.

సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవాలి

• ఆర్డీఓ సూర్యకళ

భోగాపురం: గ్రామంలో నెలకొన్న సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని ఆర్డీఓ సూర్యకళ ముంజేరు సిద్ధార్థనగర్ కాలనీవాసులకు సూచించారు. ఇటీవల సిద్ధార్థనగర్ కాలనీ సమీపంలో గ్రామంలోని వాడుకనీరు పోయేందుకు వీలుగా అధికారులు చేపట్టిన కాలువ నిర్మాణ పనులను కాలనీవాసులు అడ్డుకున్నారు. దీంతో ముంజేరు గ్రామ ప్రజలు, సర్పంచ్ పూడిక సూకరాజు కలిసి కాలువ నిర్మించాలంటూ స్పందన కార్యక్రమంలో అధికారులకు విన్నవించారు. మండల స్థాయి అధికారుల ద్వారా విషయం తెలుసుకున్న ఆర్డీఓ సూర్యకళ, డీపీఓ శ్రీధర్‌రాజా సిద్ధార్థనగర్ కాలనీకి శుక్రవారం చేరుకుని కాలువను, రోడ్డుపై నిలిచిన మురుగు నీటిని పరిశీలించారు. రోడ్డుపై నిలిచిన మురుగు నీటిని వెంటనే తొలగించాలని ఎంపీడీఓ దాసరి బంగారయ్యను ఆదేశించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామస్తులు, కాలనీవాసులు అందరూ కలిసి ఎంపీడీఓ కార్యాలయానికి వస్తే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఆర్డీఓ ఆదేశాల మేరకు ఎంపీడీఓ బంగారయ్య రోడ్డుపై నిలిచిన మురుగునీటిని వాటర్ ట్యాంక్‌ల ద్వారా బయటకు తరలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, ఈఓపీఆర్‌డీ సురేష్, డీటీ శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్డీఓ సూర్యకళ, డీపీఓ శ్రీధర్‌రాజా

అంబులెన్స్ నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ

విజయనగరం ఫోర్ట్: అంబులెన్స్‌ల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని 108 , 104 అరబిందో సర్వీసెస్ సంస్థ జోనల్ మేనేజర్ కె. గణేష్ అన్నారు. పట్టణంలోని 108 అంబులెన్స్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంబులెన్స్ కండీషన్‌ను ప్రతిరోజూ చెక్ చేసుకోవాలని సూచించారు. బాధితుల నుంచి ఫోన్ వచ్చిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని రోగిని సకాలంలో ఆస్పత్రికి చేర్పించాలని తెలిపారు. రోగిని అంబులెన్స్‌లో ఎక్కించిన వెంటనే అవసరమైన చికిత్స ప్రారంభించాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో 108 జిల్లా మేనేజర్ ఎస్. మన్మధనాయుడు, 104 పార్వతీపురం మన్యం జిల్లా మేనేజర్ పూసర్ల వెంకట దుర్గప్రసాద్, విజయనగరం జిల్లా మేనేజర్ బైరెడ్డి వినోద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



108 అంబులెన్స్‌ను పరిశీలిస్తున్న జోనల్ మేనేజర్ గణేష్

సమస్యలు పరిష్కరించాలంటూ వినతి



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏల సంఘ ప్రతినిధులు

నెల్లిమర్ల: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలానికి చెందిన వీఆర్‌ఏల సంఘ ప్రతినిధులు పట్టణంలోని రామతీర్థం జంక్షన్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఫేస్ యాప్ ఆధారిత హాజరు నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని.. వేతనం రూ. 26 వేలకు పెంచాలని.. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని వినతిలో పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘ మండలశాఖ అధ్యక్షుడు నేతల సూరిబాబు, బంకపల్లి కృష్ణ, టొంపల రమేష్, తదితరులున్నారు.

పెన్షనర్ల వినతి..

నెల్లిమర్ల: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వ పెన్షనర్ల సంఘ ప్రతినిధులు పట్టణంలోని రామతీర్థం జంక్షన్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్లు చెల్లించాలని, కొత్తగా పీఆర్‌సీ వేయడంతో పాటు ఎరియర్లు మంజూరు చేయాలని వినతిలో పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు కమలాకర్, విశ్వనాథరాజు తదితరులున్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద పెన్షనర్ల సంఘ ప్రతినిధులు

సీఐటీయూ ఆధ్వర్యంలో..

భోగాపురం: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలో ఉన్న వీఆర్‌ఏలు సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ, వీఆర్‌ఏలకు ఫేస్ యాప్ హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. అర్హులందరికీ వీఆర్‌ఓ, అటెండర్, వాచ్‌మెన్‌గా ప్రమోషన్లు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్‌ఏలు నారాయణ, అప్పలరాజు, దుర్గమ్మ, సరోజిని, నారాయణమ్మ, పి.మహేశ్వరి, తులసి పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి సూర్యనారాయణ, వీఆర్‌ఏలు